క్లుప్తంగా

మానవత్వం మంట గలిసింది.



ఆస్పత్రిలో ఉన్న పార్వతి

పార్వతీపురం రూరల్: స్థానిక ఏరియా ఆస్పత్రిలో మూడు రోజుల కిందట వైద్యసేవల కోసం చేర్పించిన కె. పార్వతి అనే వృద్ధురాలిని తీసుకెళ్లేందుకు ఆమె బంధువులెవ్వరూ రావడం లేదు. 70 ఏళ్లు పైబడి ఉన్న ఈమెకు కొద్ది రోజులుగా ఏరియా ఆస్పత్రిలో వైద్యసేవలు కొనసాగిస్తున్నామని ఆర్ఎంఓ కె. చిరంజీవి తెలిపారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. పార్వతమ్మ ప్రస్తుతం కోలుకుందని కుటుంబ సభ్యులు, బంధువులు వచ్చి ఆమెను తీసుకెళ్లాలని కోరారు.

ఈ రహదారికి మరమ్మతులు చేసేదెన్నడో..?



అధ్వానంగా ఉన్న పార్వతీపురం- కూనేరు రహదారి

పార్వతీపురం: పార్వతీపురం నుంచి కూనేరు వరకు ఉన్న అంతరాష్ట్ర రహదారికి మరమ్మతులు ఎప్పుడు పూర్తి చేస్తారని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కొల్లి సాంబమూర్తి అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. సంక్రాంతి పండగ నాటికి రహదారులకు మరమ్మతులు చేస్తామని ప్రభుత్వం ప్రకటించినా, ఇంతవరకు చాలా చోట్ల మరమ్మతులు జరగలేదన్నారు. ఈ రహదారిపై నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తాయని, వెంటనే అధికారులు స్పందించి రహదారికి మరమ్మతులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

చట్టాలపై అవగాహన తప్పనిసరి



మాట్లాడుతున్న న్యాయమూర్తులు

సాలూరు: విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని గజపతినగరం, సాలూరు సివిల్ జడ్జిలు కనకమహాలక్ష్మి, రమేష్ తెలిపారు. శనివారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన అవగాహన సదస్సులో పోక్సో, నూతన చట్టాలపై అవగాహన కల్పించారు. వీలైనంత వరకు విద్యార్థులు ఫోన్లకు దూరంగా ఉండాలన్నారు. ప్రణాళికాబద్ధంగా చదువుకుంటే ఉన్నత స్థానాలు అధిరోహించవచ్చని చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఉషశ్రీ, సీఐ అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ



అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఐసీడీఎస్ పీడీ కనకదుర్గ

సాలూరు: గుమడాంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాలను ఐసీడీఎస్ పీడీ కనకదుర్గ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. సాధారణ తనిఖీల్లో భాగంగా కేంద్రాలను సందర్శించినట్లు చెప్పారు. అద్దె భవనాలకు సంబంధించిన అద్దె చెల్లించనున్నట్లు తెలిపారు. అనంతరం సీడీపీఓ కార్యాలయానికి వెళ్లి రికార్డులను తనిఖీ చేశారు. కార్యక్రమంలో సీడీపీఓ విజయలక్ష్మి, సూపర్‌వైజర్లు, తదితరులు పాల్గొన్నారు.

వరి చేనులో ఎలుకల బెడద



ఎలుకలు పాడు చేసిన వరి పైరు

సీతానగరం: మండలంలోని నీటి వనరులున్న గ్రామాల్లో రైతులు సాగు చేస్తున్న వరి పంటకు ఎలుకల బెడద ఎక్కువైంది. బోర్లు, సువర్ణముఖీ నది పరీవాహక గ్రామాల్లో సుమారు 250 ఎకరాల్లో రబీ వరి సాగవుతోంది. పైరు ఏపుగా పెరిగిన సమయంలో ఎలుకల బెడద ఎక్కువైందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎలుకలు రాత్రి పూట పంటలోకి ప్రవేశించి వరి మొదళ్లను నాశనం చేస్తున్నాయని వాపోతున్నారు. ఈ విషయమై ఏఓ అవినాష్ వద్ద ప్రస్తావించగా.. ఎలుకల నివారణకు బెల్లం, తవుడు, ఎలుకల మందు కలిపి ఉండలుగా చుట్టి పైరులో వేయాలని సూచించారు.



వేసవిలో ఇంటి దొంగతనాలు ఎక్కువగా చోటు చేసుకునే అవకాశం ఉంది.. వేసవికాలం సెలవుల సరదాలనే కాదు.. దొంగల బెడదనూ తెచ్చి పెడుతుంది. ఏడాది కాలంలో జరిగే చోరీల్లో సుమారు సగం ఈ వేసవి సీజన్‌లో జరగడం గమనార్హం. సెలవుల్లో సొంతూరు ప్రయాణాలు, శుభకార్యాల సందళ్లు, ఆరుబయట నిద్రలు.. చోరుల హస్తలాఘవానికి కారణంగా నిలుస్తున్నాయి. కనీస జాగ్రత్తలు పాటించకపోతే ఇల్లు గుల్ల కావడం ఖాయం.

ఏమాత్రం అలక్ష్యంగా ఉన్నా..

ఇల్లు గుల్ల కావడం ఖాయం

- వేసవిలో దొంగల బెడద
- ఇళ్లకు తాళాలు వేసి ఊర్లకు వెళ్తే అంతే సంగతులు
- కనీస జాగ్రత్తలు తప్పనిసరి

పార్వతీపురం రూరల్:

ఇంటర్ పరీక్షలు ముగిశాయి. మరికొద్ది రోజుల్లో పదో తరగతి పరీక్షలు కూడా ముగియనున్నాయి. ఈ క్రమంలో చాలామంది వేసవిలో విహారయాత్రలకు, బంధువుల ఇళ్లకు ఎక్కువగా వెళ్తుంటారు. వేసవి సెలవులకు సొంతూర్లకు వెళ్లే క్రమంలో తమ విలువైన బంగారు, వెండి ఆభరణాలను ఇంటిలోనే ఉంచి తాళం వేస్తుంటారు. అలాగే చాలామంది ఉక్కబోత కారణంతో ఆరుబయట, డాబాల మీద నిద్రిస్తుంటారు. ఇదే అదునుగా భావించిన దొంగలు చోరీలకు పాల్పడుతుంటారు. పగటిపూట రెక్కీ నిర్వహించి తాళం వేసి ఉన్న ఇళ్లను, ఆదమరిచి నిద్రిస్తున్న వారి ఇళ్లను టార్గెట్ చేసి గుట్టుచప్పుడు కాకుండా దొంగతనానికి పాల్పడుతున్నారు. నిద్రలేచే సమయానికి దొంగలు ఇల్లంతా గుల్ల చేయడంతో బాధితులు లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయిస్తున్నారు. అయితే వేసవిలో చోరీల నియంత్రణకు పోలీసులు ఎప్పటికప్పుడు హెచ్చరికలు చేస్తూనే ఉన్నారు. అంతేకాకుండా ఊరి శివారులో నివసించే ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని పోలీసులు హెచ్చరిస్తూనే ఉన్నారు.



దొంగతనం జరిగిన ఇంట్లో బీరువాను పరిశీలిస్తున్న క్లూస్ టీమ్ (ఫైల్)

జాగ్రత్తలు తప్పనిసరి

వేసవిలో ఇల్లు వదిలి బయటకు వెళ్లే సమయంలో జాగ్రత్తలు పాటించాలి. ఇంట్లోనే నగదు, బంగారం, వెండి, ఇతర విలువైన వస్తువులను పెట్టి బయటకు వెళ్తే.. దొంగకు తాళం చేవి ఇచ్చినట్లే. ఒకవేళ క్యాంప్‌లకు వెళ్లాల్సి వస్తే నాణ్యమైన తాళాలు వేసుకోవాలి. ఇంటిపైన నిరంతరం నిఘా ఉండే విధంగా జాగ్రత్తలు తీసుకోవాలి. బంగారం, వెండి ఆభరణాలను వీలైనంతవరకు బ్యాంక్ లాకర్లలో భద్రపరుచుకోవడం మేలు. నివాస ప్రాంతాల వైపు గుర్తు తెలియని వ్యక్తులు వస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలి.

స్వీయ జాగ్రత్తలు అవసరం ..



ప్రజలు స్వీయ జాగ్రత్తలు పాటించాలి. శాఖాపరంగా పెట్రోలింగ్, గస్తీని పెంచుతున్నాం. ఎవరైనా కొద్దిరోజులు ఊరెళ్లాల్సి వస్తే సమీప బంధువులు, లేదా కుటుంబంలో ఎవరో ఒక సభ్యుడిని ఇంట్లో ఉంచడం మేలు. తప్పనిసరిగా వెళ్లాల్సి వస్తే విలువైన ఆభరణాలు, ఎక్కువ మొత్తంలో నగదును ఇంటిలో ఉంచొద్దు. తలుపులకు పూర్తి భద్రతతో కూడిన తాళాలు వినియోగించడం మేలు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో చిరునామా, వివరాలు తెలిపితే ఆ ప్రాంతంలో పెట్రోలింగ్ విస్తృతం చేస్తాం. ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే 'డయల్ 100'కి సమాచారమివ్వాలి. ప్రధాన కాలనీల్లో స్థానికులంతా కలిసి సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం మంచిది.

– కె. మురళీధర్ పార్వతీపురం పట్టణ సీఐ

కాసేపు మంచు.. ఆ తర్వాత ఎండ..



ఉదయం 8 గంటల సమయంలో కురుస్తున్న మంచు

సీతానగరం: మండలంలో నాలుగు రోజులుగా ప్రజల ఆరోగ్యానికి హాని కలిగించే వాతావరణం నెలకొంది. దీంతో ప్రజలు ఇంటి నుంచి బయటకు రావడానికే భయపడుతున్నారు. వేకువజాము 4 గంటల నుంచి ఉదయం 8 వరకు విపరీతమైన మంచు కురుస్తుండగా.. ఆ తర్వాత భానుడు తన ప్రతాపాన్ని చూపిస్తున్నాడు. పొగమంచు, ఎండలతో ఎటువంటి ఇబ్బందులు తలెత్తుతాయోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

గిరిజన విశ్వ విద్యాలయం ఏర్పాటు చేయండి

పార్వతీపురం: జిల్లాలో గిరిజన విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేయాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.నాసర్, సహాయ కార్యదర్శి నాగభూషణం డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా సమితి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ఎన్‌డీఏ కూటమి ఇచ్చిన హామీ మేరకు పీజీ విద్యార్థులకు శాపంగా మారిన జీఓ 77ను రద్దు చేయాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా యూనివర్సిటీల్లో ప్రవేశం కోసం కామన్ ఎంట్రన్స్ టెస్ట్ తీసుకురావడం వల్ల యూనివర్సిటీల్లో ప్రవేశాలు తగ్గిపోయాయన్నారు. ఏ యూనివర్సిటీకి వారే ఎంట్రన్స్ పరీక్ష నిర్వహించుకునేలా అనుమతులివ్వాలని కోరారు. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ వసతిగృహాలకు సొంత భవనాలు కేటాయించాలన్నారు. అలాగే గిరిజన విద్యార్థుల మరణాలపై సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు బి. రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

అక్రమార్కులపై చర్యలు

- డ్వామా పీడీ రామచంద్రరావు

పార్వతీపురం రూరల్: ఉపాధి హామీ పథకం పనుల్లో అవకతవకలకు పాల్పడిన అక్రమార్కులపై చర్యలు తప్పవని డ్వామా పీడీ కె. రామచంద్రరావు స్పష్టం చేశారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని 30 పంచాయతీల్లో రూ.26.13 కోట్లతో చేపట్టిన 2,412 పనులపై స్టేట్ రిసోర్స్‌పర్సన్ మాధవరావు ఆధ్వర్యంలో సామాజిక తనిఖీ బృందం వారం రోజులుగా క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టింది. ఇందులో భాగంగా గుర్తించిన లోటుపాట్లను ప్రజావేదిక కార్యక్రమంలో వెల్లడించారు. హార్టికల్చర్ పథకంలో లక్షల రూపాయల అక్రమాలు జరిగాయని సామాజిక తనిఖీ బృందం గుర్తించింది. క్షేత్రస్థాయి సిబ్బంది వేతనదారులకు సంబంధించిన రికార్డులు సక్రమంగా నిర్వహించలేదని సభ దృష్టికి తీసుకువచ్చారు. మొక్కల పెంపకానికి లక్షలాది రూపాయలు వెచ్చించినట్లు రికార్డుల్లో నమోదు చేశారే తప్ప.. క్షేత్రస్థాయిలో అంత ఖర్చు కాలేదని సిబ్బంది తేల్చారు. దీంతో డ్వామా పీడీ ఉపాధి సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్రమాలకు పాల్పడిన ఫీల్డ్ అసిస్టెంట్ల జీతాలను తక్షణమే నిలుపుదల చేయాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ జీవీ రమణమూర్తిని ఆదేశించారు.



ఉపాధిహామీ సిబ్బందిని ప్రశ్నిస్తున్న డ్వామా పీడీ రామచంద్రరావు

నియామకాలు..

పార్వతీపురం టౌన్: వైఎస్సార్‌సీపీ అసెంబ్లీ నియోజకవర్గ ఎంప్లాయిస్ అండ్ పెన్షనర్ల విభాగ అధ్యక్షులను పార్టీ కేంద్ర కార్యాలయం నియమించింది. పార్టీ అధ్యక్షుడు జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు కార్యాలయం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. కురుపాం నియోజకవర్గానికి పెంట సూర్యనారాయణ, పార్వతీపురం నియోజకవర్గానికి పోల గోవిందరావు, సాలూరుకు మూడడ్ల సూర్యనారాయణను నియమించారు.

కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయాలి



సంతకాలు సేకరిస్తున్న దృశ్యం

సాలూరు: పురపాలక సంఘాలు, కార్పొరేషన్‌లలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని మున్సిపల్ వర్కర్స్‌అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) నాయకులు రాము, శంకరరావు, తదితరులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మున్సిపల్ మంత్రి నారాయణకు అందించేందుకు శనివారం పట్టణంలో సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం కార్మికుల భవిష్యత్‌ను కాంట్రాక్టర్ల చేతుల్లో పెట్టాలని చూస్తే ఊరుకునేది లేదన్నారు. గత సమ్మెకాలంలో చేసిన ఒప్పందాలను అమలు చేయాలని కోరారు. లేనిపక్షంలో పోరాటం తప్పదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో నాయకులు మధుమోహన్, శ్రీను, రవి, తదితరులు పాల్గొన్నారు.

నాగళ్లు సిద్ధం..



ఉగాది సందర్భంగా ఆదివారం తొలిఏరు పూసేందుకు రైతులు నాగళ్లను సిద్ధం చేసుకున్నారు. కొద్ది రోజుల ముందరే వడ్రంగులకు కర్రలు ఇవ్వగా వారు నాగళ్లను తయారు చేశారు. రైతులు శనివారం సాయంత్రం వడ్రంగుల ఇళ్లకు వెళ్లి బియ్యం, డబ్బులు ఇచ్చి నాగళ్లను తీసుకున్నారు. – సీతానగరం

శాశ్వత లోక్ అదాలత్‌తో సమస్యల పరిష్కారం

- రెండో అదనపు జిల్లా జడ్జి దామోదరరావు



సంతకాలు సేకరిస్తున్న దృశ్యం

పార్వతీపురం టౌన్: కేసులకు శాశ్వత పరిష్కారం చూపే లోక్ అదాలత్‌లను ప్రజలు వినియోగించుకోవాలని రెండో అదనపు జిల్లా జడ్జి ఎస్. దామోదరరావు అన్నారు. శనివారం స్థానిక జిల్లా కోర్టు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పారాలీగల్ వలంటీర్ల శిక్షణ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నీరు, విద్యుత్ సరఫరాలలో వివాదాలు, పోస్టల్, టెలిఫోన్ సేవల్లో వివాదాలు, ప్రజా సంరక్షణ సేవల్లో సమస్యలు, బ్యాంకులు, ఇతర ఆర్థిక లావాదేవీలు జరిపే సంస్థల్లో వివాదాలను పరిష్కరించే అధికారం శాశ్వత లోక్ అదాలత్‌కు ఉందని వివరించారు. శాశ్వత లోక్ అదాలత్ అధ్యక్షుడిగా జిల్లా జడ్జి స్థాయి అధికారి ఉంటారని, ఆయనతో పాటు ఇద్దరు సభ్యులు ఉంటారన్నారు. కక్షిదారులు లోక్ అదాలత్‌కు దరఖాస్తు చేసుకుంటే ఎటువంటి రుసుం చెల్లించకుండా సమస్యను పరిష్కరించుకోవచ్చన్నారు. ఇరుపక్షాల అంగీకారం మేరకు తీర్పు ఇవ్వడం జరుగుతుందని చెప్పారు. శాశ్వత లోక్ అదాలత్ ఇచ్చే తీర్పు అంతిమమని.. దీనిపై అప్పీల్ చేసుకునే అవకాశం ఉండదన్నారు. కార్యక్రమంలో లోక్ అదాలత్ సభ్యుడు టి.జోగారావు, ఏపీపీ డి. సత్యనారాయణ, సీనియర్ అడ్వకేట్ ఎంపీ రమణ, తదితరులు పాల్గొన్నారు.

పంచాంగ శ్రవణం..



తెలుగు సంవత్సరాది సందర్భంగా అమవాస్య తిథిని పురస్కరించుకుని శనివారం పలు గ్రామాల్లో అర్చకులు పంచాంగశ్రవణం చేపట్టారు. మిర్తివలసలో యర్ల రాంబాబు శాస్త్రి ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణం జరిగింది. శ్రీ విశ్వావసు నామ సంవత్సరం సందర్భంగా సంవత్సర ఫలితాలు ఏవిధంగా ఉంటాయి.. ఏయే పంటలు పండుతాయి.. మంగళవారం ఏరువాక ముహూర్తం.. కొత్త వస్తువులు ఎప్పుడు ధరించాలి.. తదితర విషయాలను శాస్త్రి వెల్లడించారు. కార్యక్రమంలో అర్చకులు, గ్రామస్తులు పాల్గొన్నారు. – బలిజిపేట

బిజీబిజీగా కార్యదర్శులు..



గ్రామ పంచాయతీ అభివృద్ధి పనుల ప్రణాళికలను ఆన్‌లైన్‌లో నమోదు చేసే పనిలో కార్యదర్శులు బిజీగా ఉన్నారు. మండలంలో 2025 – 26 ఆర్థిక సంవత్సరంలో గ్రామాల్లో నిర్వహించనున్న పనులకు సంబంధించి ప్రజామోదం కోసం ఇటీవల గ్రామాల్లో సభలు నిర్వహించారు. గ్రామసభల్లో ఆమోదించిన పనుల వివరాలను ఉన్నతాధికారుల సూచనల మేరకు ఎంపీడీఓ పి. త్రివిక్రమరావు ఆధ్వర్యంలో కార్యదర్శులు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆన్‌లైన్ నమోదులు చేపడుతున్నారు. – సీతానగరం

అరకు ఎంపీకి తీవ్ర అవమానం

- మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు



పార్వతీపురం టౌన్: ఇటీవల పార్లమెంట్ ప్రాంగణంలో జరిగిన ఓ కార్యక్రమంలో కూటమి నాయకులు ప్రొటోకాల్ ఉల్లంఘించి అరకు ఎంపీ గుమ్మ తనూజారాణిని అవమానించారని మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. శనివారం ఆయన తన స్వగృహంలో విలేకరులతో మాట్లాడుతూ... అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన అరకు కాఫీకి మరింత గుర్తింపు తీసుకువచ్చేలా పార్లమెంట్‌లో స్టాల్ ఏర్పాటు చేశారన్నారు. రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి, గిరిజన సహకార సంస్థ చైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్, పలువురు కేంద్రమంత్రులు స్టాల్‌ను ఏర్పాటు చేయడం శుభపరిణామమేనన్నారు. అయితే ఈ కార్యక్రమానికి అరకు ఎంపీ తనూజారాణిని ఆహ్వానించకపోవడం ప్రొటోకాల్ ఉల్లంఘన కాదా అని ప్రశ్నించారు. గిరిజన మహిళా ఎంపీని అగౌరవపరచడం ఎంతవరకు సమంజసమన్నారు.